# దెయ్యం

రాయప్రోలు వామనమూర్తి

దెయ్యం, దెయ్యం అంటూ కేకలు వేస్తున్నాడు రమేష్. ఆ కేకలకు లోపల పనిచేసుకుంటున్న అమ్మమ్మ, ఏదో చదువుకుంటున్న తాతయ్య రమేష్ మంచం దగ్గరకు వచ్చారు. నాయనా రమేష్ లేలే అంటూ తాతయ్య, అమ్మమ్మ లేపసాగారు.

ఈ హడావిడికి ప్రక్కనే మంచాలమీద పడుకున్న లక్ష్మి, రవి లేచి చూస్తున్నారు. దెయ్యం ఏమిటి అంటూ రమేష్‌ను లేపారు. కళ్ళు తెరచి అటూ ఇటూ చూసాడు. తోట లేదు. దెయ్యం లేదు. నేను మంచం మీదనే ఉన్నానన్న మాట అన్నాడు రమేష్.

నాయనా రమేష్ కల వచ్చిందా అని అడిగారు తాతయ్య, అమ్మమ్మా. ఏం కల అది. కల నుంచి తేరుకున్నాడు రమేష్. ఆ రోజు తాతయ్య ఊరుకెళ్ళాడట. నేను, అక్క, తమ్ముడు తోటకెళ్ళమన్నావట అమ్మమ్మా. నేను, అక్క, తమ్ముడు తోటకెళ్ళి ఆడుకుంటున్నాం. పాలేరు పాపయ్య దూరంగా ఉన్నాడు. మోటారు వదిలి తోటకు నీళ్ళు పెడుతున్నాడు.

తోటలో జామపళ్ళు కోసుకుతిన్నాం. బంగినపల్లి మామిడి చెట్టుక్రింద ఆడుకుంటున్నాం. నేను కొమ్మ ఎక్కి కోతిలా క్రిందకు దూకుతున్నాను. అక్క, తమ్ముడు అది చూచి బలే బలే అంటున్నారు.

ఇంతలో అక్క తమ్ముడూ మన ఊళ్ళో ఉన్న శివలింగంలాంటిది ఇక్కడ ఉంది. గబ గబ చెట్టు కొమ్మమీదనుండి దిగి వచ్చాను. తెల్లగా శివలింగంలా ఉంది చిన్నశివలింగమేమో అని చిన్న కర్రపుల్ల పెట్టి చుట్టూ త్రవ్వాను. అది ఓ సీసా దానికి పెట్టిన మూత శివలింగంలా ఉంది. సీసా పైకి తీసి చూసాను. దానిలో ఏదో కదులుచున్నట్లుగా కనిపించింది.

దానిలో ఏమి ఉందోనని మూత తీసాను. ఓగాలిలా బయటకు వచ్చి మా ఎదురుగా ఓ మనిషిలా నిలబడింది. నీవు ఎవరవు అని అడిగానట. నేను దెయ్యాన్ని అందట. దెయ్యం అనగానే మాకు చాలా భయం వేసింది. అక్క, తమ్ముడు మరీ భయపడిపోతున్నారు. ఆ భయంతో వాళ్ళు ఆకలి అన్నారు. వెంటనే ఆ దెయ్యం గాలిలో చేయి ఊపింది. మిఠాయిలు, జిలేబీలు, యిలా రకరకాలుగా ప్లేటునిండా వచ్చాయి. అందరం తిన్నాం.

నాకు దెయ్యం అంటే భయం వేసింది. పారిపోదామంటే అది ఏం చేస్తుందోననే భయం. కాళ్ళు చేతులు వణుకుతున్నాయి.దీన్ని చూస్తే మంచి దెయ్యంలాగా ఉంది. కొసవరకు ఇలా మంచిగా ఉంటుందనే నమ్మకం ఏముంటుంది. ఏం చేయాలో నాకు బోధపడలేదు.

నా భయాన్ని దెయ్యానికి కనబడనీయలేదట. ఇంతలో తాతయ్య సాయంకాలం చెప్పే రామాయణ కథలు, దెయ్యం కథలు గుర్తుకు రాసాగాయి. ధైర్యంగా దెయ్యాన్ని చూసి అంత పెద్దగా ఉన్నావు. ఇంత చిన్న సీసాలో ఎలా పట్టావు అన్నానట. వెంటనే దెయ్యం ఇలా అంటూ గాలిలా మారి సీసాలోకి వెళ్ళిందట. వెంటనే సీసాకు మూత పెట్టేసాను తాతయ్య.

అందుకే ఎప్పుడూ వెల్లకిలా పడుకుని నిద్రపోవద్దంటాను. ఇలాంటి పాడు కలలే వస్తాయి. రమేష్‌కి చల్లని నీళ్ళు త్రాగించి నేను ఇక్కడే ఉంటాను పడుకో అంది అమ్మమ్మ.


## పుస్తకావిష్కరణ వేదిక

**విజయవాడలో పుస్తకావిష్కరణ అభిలషించే రచయితలకు**

**ఆహ్వానం**

'చినుకు–శ్రీ వాగ్దేవి' సంయుక్తంగా
ప్రగతిశీలసాహిత్యగ్రంథాల
ఆవిష్కరణోత్సవానికి
సహకారాన్ని అందిస్తున్నాయని
తెలియచేస్తున్నాం.
ఉత్సాహం ఉన్న రచయితలు
చినుకు సంపాదకవర్గాన్ని
సంప్రదించండి